ప్రజాశక్తి
శుక్రవారం 3 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత కార్యాలయంలో సాక్షం అంగన్వాడీ పోషణ్ 2.0 కింద కాంట్రాక్ట్ పద్ధతిన జిల్లా కో-ఆర్డినేటర్, ప్రాజెక్టు సహాయకుల పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిన ఏడాది పాటు భర్తీకి గానూ అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారిణి ఎం.ఎన్ రాణి తెలిపారు. అర్హత, నిర్ణయ ప్రమాణాలు తదితర పూర్తి వివరాలు, నిర్ణీత దరఖాస్తు ఫారం కోసం, దరఖాస్తు చేయగోరు అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంను, అర్హతలకు సంబంధించిన అన్ని సర్టిఫికేట్ల నకళ్లు ఏదేనా గజిటెడ్ అధికారి వారిచే అటెస్టేషన్ చేయించి, వాటిని పూర్తి చేసిన దరఖాస్తుతో తమ కార్యాలయంలో ఈనెల 10 తేది సాయంత్రం 6గంటల్లోపు అందజేయాలని తెలిపారు.

కరువు కనిపించదా?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎటు చూసినా ఎండిపోయిన పంట పొలాలు, బీటలు వారిన భూములతో కరువు దుస్థితి కళ్లముందు కదలాడుతోంది. అయినప్పటికీ, మంత్రులు, ఎమ్మెల్యేలకు రైతుల బాధలు, ఇబ్బందులు, ఆందోళనకరమైన దుస్థితి కనిపించలేదు. నిబంధనల బూచీ అడ్డు రావడం వల్ల అధికారులు కూడా కరువు నివేదికలు పంపలేదు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన 103 కరువు మండలాల జాబితాలో ఉమ్మడి జిల్లాలో 20 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఉన్నప్పటికీ ఒక్క మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా గుర్తించకపోవడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది.

- ఆగస్టు వరకూ వరినాట్లు
- అక్టోబర్‌లో రాలని చినుకు
- కొంపముంచిన వర్షపాతం
- బీటలు వారిన పంట భూములు
- ఉమ్మడి జిల్లాలో విలవిల్లాడుతున్న రైతాంగం
- పట్టని పాలకులు

వీరఘట్టంలో నీరులేక ఎండిపోతున్న వరిపొలం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. విజయనగరం జిల్లాలో ఖరీఫ్‌లో అన్ని పంటలూ కలిపి 3,09,834 ఎకరాల్లో సాగు కావాల్సివుండగా, నీటి ఎద్దడి కారణంగా అతికష్టం మీద 2,80,738 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి 2,31,835 ఎకరాల్లో సాగైంది. ఆ తరువాత స్థానంలో 30,581 ఎకరాల్లో సాగయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు ఉన్నాయి. కానీ, వర్షపాతం నెలవారీ హెచ్చుతగ్గుల వల్ల సమయానికి నాట్లు పడలేదు. మొక్కజొన్న, పత్తి, అపరాలు సహా అన్ని పంటల సాగూ తగ్గింది.

సాగునీటి వనరులు లేవా?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టులేవీ లేవు. నదులు, జీవగెడ్డలు రాష్ట్రంలో మరెక్కడా చెరువులు ఉన్నప్పటికీ వాటిని నిర్వహణ పాలకులు పూర్తిగా గాలికి వదిలేశారు. తోటపల్లి, జంఝావతి, ఆండ్ర, తాటిపూడి, పెదంకలాం, పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, ఒట్టిగెడ్డ, మడ్డువలస జలాశయాలు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ అధ్వానంగా ఉంది. ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. ఖరీఫ్ సీజన్‌కు ముందు ఏటా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు జలాశయాల కింద నీరు విడుదల చేస్తూ హడావుడి చేయడం తప్పా తరువాత పట్టించుకోవడం లేదు.

సాధారణ వర్షపాతం ఏమైపోయిందంటే..

కొన్ని దశాబ్దాలుగా అధికార, ప్రతిపక్షాలు జిల్లాపై చూపిన నిర్లక్ష్యం వల్ల వర్షపు నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది. ఉన్న కొద్దిపాటి నీరు కూడా పంటపొలాలకు చేరే విధంగా పిల్లకాలువల నిర్మాణం, పూడిక తీత లేదు. దీంతో, సాధారణ వర్షపాతం నమోదైనా పాలకుల పుణ్యమా అని వినియోగంలోకి రాకుండానే పోతోంది. దీనికితోడు వర్షాన్ని కొలిచే రైన్ గేజులు కూడా జిల్లాలో తగినన్ని లేవు. మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల అదే మండలంలో చినుకు కూడా రాలని గ్రామాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉనికిలోకి రావడం లేదు.

భౌతిక పరిస్థితులను పట్టించుకునేదెవరు?

కరువు జిల్లా లేదా మండలంగా గుర్తించాలంటే కొన్ని నిబంధనలు ఉన్నాయి. కానీ, ప్రత్యేకమైన భౌతిక పరిస్థితుల వల్ల కరువు కాటకాలకు గురైన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు కరువు జిల్లాల జాబితాలో లేకుండా పోయాయి. వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ప్రసంగాలు ఊదరగొట్టిన జిల్లా పరిషత్ చైర్మన్ కూడా అటువంటి తీర్మాణం చేసి, ప్రభుత్వానికి నివేదించేందుకు ప్రయత్నం చేయలేదు.

ఖరీఫ్ సీజన్ వర్షపాతం వివరాలు

నెల	సాధారణ వర్షపాతం(మి.మీ.లో)	కురిసింది వర్షపాతం(మి.మీ.లో)	వ్యత్యాసం
జూన్	124	59	-52
జులై	171	312	+82
ఆగస్టు	188	143	-24
సెప్టెంబర్	185	214	-16
అక్టోబర్	161	22.7	-87.3
మొత్తం	**829**	**749**	**- 80**

సాగునీటి కాలువల కిందా అంతే సంగతులు

జలాశయాల నిర్వహణ గురించి ప్రభుత్వానికి పట్టకపోవడంతో సాగునీటి కాలువల కింద కూడా పూర్తిస్థాయిలో ఉబాలు కాలేదు. అష్టకష్టాలు పడి ఉబాలు పట్టినప్పటికీ ఇప్పుడు నీరందించుకోలేని దుస్థితి. ఈ ఏడాది తోటపల్లి జలాశయం ద్వారా 78,563 ఎకరాలకు సాగునీరు అందించాల్సివుండగా 53,574 ఎకరాలకు సాగునీరు మాత్రమే అందినట్టు సాక్షాత్తు ప్రాజెక్టు అధికారులు సెలవిస్తుండడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

50శాతం పంటలు ఎండిపోయినట్టే

మొత్తం పంటల విస్తీర్ణంలో ఇప్పటికే 50శాతం ఎండిపోయింది. ముఖ్యంగా వరి లక్ష ఎకరాల్లో ఎండుతోంది. మరో 10వేల ఎకరాల్లో మొక్కజొన్న దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. ఇంకో 10వేల ఎకరాల వరకు పత్తి, అపరాలు, చిరుధాన్యాలు, అపరాలు సాగు దిబ్బతినే ప్రమాదం ఉంది. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల ఎండిన పంటలను పరిశీలించినప్పటికీ విస్తీర్ణాన్ని తక్కువ చూపుతుండడం గమనార్హం.

కొంపముంచిన వర్షపాతం

సీజన్ ముగిసేనాటికి (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) సాధారణ వర్షపాతం కావడంతో కరువు ప్రాంతంగా గుర్తించడం సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. జూన్‌లో 52 మిల్లీ మీటర్ల మేర లోటు వర్షపాతం నమోదు కావడంతో నారుపోసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. జులైలో 82 మి.మీటర్ల వర్షం అధికంగా కురవడంతో నారుపోత పూర్తయింది. ఆగస్టులో 24 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. దీంతో, చెరువులు, కాలువలు, వాగుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకొని ఆ నెలాఖరు వరకు ఉబాలు పెట్టారు. నాట్లు ఆలస్యం కావడంతో అక్టోబర్ ప్రారంభం నాటికి ముఖ్యంగా వరి వెన్నుకట్టడం, అక్కడక్కడ పొట్ట దశలోకి వచ్చాయి. ప్రస్తుతం నీరందాల్సిన ఈ సమయంలో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వచ్చింది. అక్టోబర్‌లో 178.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సివుండగా కేవలం కేవలం 22.7 మి.మీ మాత్రమే పడింది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని మండలాల్లోనూ తీవ్ర నీటి ఎద్దడి కనిపిస్తోంది. వరితోపాటు మొక్కజొన్న, పత్తి తదితర పంటలన్నీ ఎండిపోతున్నాయి.

కరువు ప్రతిపాదన పంపలేదు

కరువు ప్రతిపాదనేమీ ప్రభుత్వానికి పంపలేదు. కొంత వరకు పంటలు ఎండిన మాట వాస్తవమే. కానీ, ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. వరుసగా 21రోజులపాటు వ్యవధి ఉండాలన్న నిబంధన కూడా మన జిల్లాకు వర్తించే పరిస్థితి లేదు. అక్టోబర్‌లో వర్షాలు పడలేదు. సెప్టెంబర్ 30 నాటికి ఉన్న పరిస్థితిపై నివేదిక పంపించాం. అప్పటి పరిస్థితిని బట్టి కరువు నిబంధనలు వర్తించే పరిస్థితి లేదు. దీంతో కరువు ప్రాంతంగా గుర్తింపు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

- వి.టి రామారావు
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

భూ హక్కుల పంపిణీకి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల14న జరగనున్న అసైన్మెంటు భూముల హక్కుల పంపిణీ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని సిసిఎల్ఎ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ తెలిపారు. గురువారం సిసిఎల్ఎ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, సర్వే అండ్ సెటల్మెంటు కమిషనరు సిద్దార్థ జైన్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20ఏళ్ల ముందు పంపిణీ చేసిన అసైన్‌మెంటు భూములకు శాశ్వత హక్కులు దఖలు పరుస్తూ ధ్రువపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 14న ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. అందుకు కావాల్సిన పత్రాలన్నింటిని సిద్ధం చేయాలని తెలిపారు. ఎస్‌సిలకు శ్మశానవాటికల కోసం భూసేకరణ పూర్తిచేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు నిశాంత్ కుమార్, జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు, డిఆర్ఒ జె. వెంకటరావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటిడిఎ పిఒ సి. విష్ణుచరణ్ తెలిపారు. గురువారం జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, శతశాతం ఉత్తీర్ణతతో పాటు ప్రతి ఒక్కరూ 80శాతం మార్కులు సాధించాలని తెలిపారు. అనంతరం వసతిగృహంలో వంటగది, మరుగుదొడ్లు తనిఖీచేసి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వసతిగృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది హాజరు, అవుట్ పేషంటు విభాగం, మందులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను గూర్చి రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టలు సిబ్బంది, వైద్యాధికారులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా జరుగుతున్న స్వర్ణోత్సవ వేడుకల ప్రారంభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఈనెల 5న పార్వతీపురం డిఇఒ కార్యాలయం నుంచి ఉపాధ్యాయుల ర్యాలీ ప్రారంభమై ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సాగుతుందని తెలిపారు. అనంతరం అదే మైదానంలో స్వర్ణోత్సవ మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ వేడుకలకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడిపి పార్వతీపురం నియోజకవర్గ వర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు హాజరవుతా రని తెలిపారు. ఈ వేడుకలు పండుగ వాతావరణంలో జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ఈ 50 ఏళ్లలో సంఘం చేసిన కృషి గురించి వివరిస్తామని తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లాలోని ఉపాధ్యాయులంతా హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో అష్ట కష్టాలు పడి పగలనకా రాత్రనకా పంట సాగు చేసినప్పటికీ ఎండలతీవ్రత వల్ల పొట్టదశలో సాగునీరందక కళ్ల ముందే పంటలు నాశనం కావడంతో అన్నదాతలు కంటతడి పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు అండగా ప్రభుత్వం ఉంటుందని పాలకులు ఉపన్యాసాలకే పరిమితం అవుతున్నారు తప్ప సాగునీరు, ఎరువులు, విత్తనాలు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు చేస్తే చివర ప్రాంతాల వరకు సాగునీరందించవచ్చునని మాటల్లో తప్ప చేతల్లో ఈ ప్రాంత పాలకులకు లేదన్నారు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి కానరావడంతో అన్నదాతలకు అప్పులు తప్ప పంట చేతికి రావడం లేదన్నారు. ఈ కారణంగా అన్నదాతలు పూర్తిగా కృంగిపోతున్నట్లు తెలిపారు. అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యలు చేసుకునే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని, కావున రైతులు ఆ స్థితికి చేరుకోక ముందే పంట నష్టాలను పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సాలూరు మండలం తోణాం పంచాయతీ దిగువమెండెంగిలో తాదంగి అప్పల స్వామి చెందిన మేకల్లో ఒక మేక మనిషి తల పోలిన మేక పిల్ల జన్మించింది. దీన్ని చూడ్డానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చారు .ఈ జీవి జన్మించిన కొద్ది గంటలకే మరణించింది.

ప్రజాశక్తి - సాలూరురూరల్

చలో విజయవాడను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -సీతానగరం

ఈనెల 15న జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చలో విజయవాడ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రక్షణ బస్సు యాత్రలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజలపై దాడులు పెరిగాయని, ఈ అసమానతలు పోవాలని అన్నారు. ప్రత్యామ్నాయ విధానాల కోసం ప్రజలంతా కలిసి రావాలని కోరుతూ జరగనున్న బహిరంగసభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని, కావున ప్రజలంతా ఈ బహిరంగసభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకటరవణ, ఎం.సింహాచలం, రాధ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కొమరాడ: అసమానతలు లేని రాష్ట్రం జిల్లా అభివృద్ధి కోసం ఈనెల 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజారక్షణభేరి ముగింపు బహిరంగ సభ కు భారీగా ప్రజలు కదిలి రావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు బహిరంగ సభకు సంబంధించిన గోడ పోస్టర్లు కొమరాడలో విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉపేంద్ర, లక్ష్మం నాయుడు, రామారావు, రైతులు పాల్గొన్నారు.

పాలకొండ: అసమానతల్లేని రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం తలపెట్టిన ప్రజారక్షణ భేరి ముగింపు సభ ఈ నెల 15 న విజయవాడలో జరగనుంది అని, ఈ కార్యక్రమంలో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం మండల కమిటీ కన్వీనర్ దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను పాలకొండలో ఆవిష్కరించారు. కరెంట్ యూనిట్‌కు ఒక రూపాయి, గ్యాస్ నాలుగు వందల రూపాయలకు, అరవై రూపాయలకే డీజిల్, పెట్రోలు తదితర ప్రజలకు అవసరమైన అంశాలపై ఈ ముగింపు సభలో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.రాము, డి.పట్టాభి, సంజీవి, వేణు, దుర్గారావు, వీరయ్య, వాసు తదితరులు ఉన్నారు.

ప్రజా రక్షణ కోసం..

- నేడు సిపిఎం ఆధ్వర్యాన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర
- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఆధునీకరణ పేరిట భీమసింగి సుగర్స్ మూత
- రైతుల బకాయి కోసం 'ఎన్‌సిఎస్' భూముల విక్రయం
- విద్యుత్ భారాలతో కుదేలైన ఫెర్రో పరిశ్రమలు
- వెలవెలబోతున్న పారిశ్రామిక వాడలు

జిల్లాలోని కీలకరంగాలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయకపోవడంతో వాటి పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఫలితంగా ఏటా కరువు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చెరకు రైతుల జీవనోపాధిపైనా కోలుకోలేని దెబ్బతీసింది. పరిశ్రమల ఏర్పాటుపై, ఉన్న పరిశ్రమల మనుగడకు సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. విద్యుత్ భారాలతో జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఒక్కక్కొటిగా మూతపడుతున్నాయి. ఇవేవీ పట్టని వైసిపి మళ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తోంది. టిడిపి నాయకులు అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లిన పార్టీ అధినేత చంద్రబాబు కోసం తప్ప, ప్రజా సమస్యలపై స్పందించడం లేదు. జనసేన కూడా అదే దారిలో నడుస్తోంది. ఈనేపథ్యంలో సిపిఎం ప్రజారక్షణ భేరీ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజాసమస్యలపై పోరాడేందుకు సన్నద్ధమైది. అందులో భాగంగానే ఈనెల 30న మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన జిల్లాలోని పలు మండలాలు మీదుగా అల్లూరి జిల్లాలోకి వెళ్లింది. ఇటు మైదాన, పట్టణ ప్రాంతాలను కలుపుతూ శ్రీకాకుళం జిల్లా మందసలో గురువారం ప్రారంభమైన మరో ప్రజారక్షణ భేరీ బస్సుయాత్ర శుక్రవారం పూసపాటిరేగ మీదుగా విజయనగరం, ఎస్.కోట, కొత్తవలస వరకు సాగుతుంది. విజయనగరంలో ఉదయం 10గంటలకు కోట వద్ద బహిరంగ సభ జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన సమస్యలు, ఎన్నికలకు ముందు సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీలను చాలా మంది గుర్తు చేస్తున్నారు.

-ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

సిఎం జగన్ ఎన్నికలకు ముందు విజయనగరం జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో సాగునీటి కేటాయింపులు పెంచుతామని, ఈ జిల్లాలో తోటపల్లి, తామ తీర్థసాగర్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఆచరణలో మాట నిలబెట్టుకోలేదు. సుమారు 24 వేల ఎకరాలకు సాగునీటితో పాటు విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2004లో తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు గతేడాది (2022-23) 124.50 కోట్లు కేటాయిస్తామంటూ బడ్జెట్ సమావేశంలో చెప్పిన ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అంతకు ముందు మూడేళ్లు కూడా పెద్దగా నిధులు కేటాయించలేదు. దీంతో, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో భూములు బీడువారుతున్నాయి. ఈ ఏడాది ఈ మండలాల్లో కరువు కోరల్లో ఉన్నాయి. అటు విజయనగరం పట్టణ వాసుల దాహార్తి కూడా తీరడం లేదు.

లక్ష్యానికి చేరుకోని తోటపల్లి

సుమారు 64 వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తోటపల్లి ప్రాజెక్టు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. పెండింగ్ పనుల వల్ల పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు. విజయనగరం జిల్లాలో ఈ ఏడాది కేవలం 35వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించినట్టు సాక్షాత్తు అధికారులు చెబుతున్నారు. పునరావాసానికి మొత్తం రూ.204కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై, బతుకు భారమై తల్లడిల్లుతున్నారు.

విద్యుత్ భారంతో కుదేలైన ఫెర్రో పరిశ్రమలు

విద్యుత్ ఛార్జీలతో ల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూడపడుతున్నాయి. అధికారంలోకి రాగానే వీటిని బలోపేతం చేస్తానని సిఎం జగన్ చెప్పారు. గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు పరిశ్రమలు ఉండేవి. వీటిలో మూడు చాలా కాలం క్రితం మూతపడ్డాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న సిరి ఫెర్రో, యోన, ఇంపెక్స్, గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేస్ నడుస్తోంది. దీంతో, ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

బొబ్బిలిలో శ్రీనివాసా జ్యూట్ మిల్లును తెరిపిస్తామంటూ జగన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే కూడా హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆచరణలో యాజమాన్యంతో కుమ్మక్కై రియల్ ఎస్టేట్ కోసం విక్రయించారు. దీంతో, వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

ఆధునీకరణ పేరిట రెండేళ్ల క్రితం భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తగినంత చెరకు ఉత్పత్తి లేని కారణంగా తెరవలేక పోతున్నామని మంత్రి బొత్స బుకాయిస్తున్నారు. దీంతో, స్థానిక రైతులు రేగిడి మండలం సంకిలి వరకు తీసుకెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

సీతానగరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్స్ యాజమాన్యం రైతులకు బకాయిల చెల్లింపు పేరిట యాజమాన్యంతో కుమ్మక్కై ఏకంగా ఆ పరిశ్రమకు చెందిన భూములే విక్రయించారు. వీరు ఇక్కడి రైతులు కూడా చెరకు సంకిలి ఫ్యాక్టరీకి తీసుకెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

మరోవైపు సారిపల్లి, విటి అగ్రహారం, కంటకాపల్లి, బొబ్బిలి గ్రోత్ సెంటర్ పారిశ్రామిక వాడలు బోసిపోతున్నాయి. కొత్త పరిశ్రమలు రావడం లేదు సరికదా ఉన్న చిన్నచిన్న పరిశ్రమలు కూడా ఒకొక్కటిగా మూతపడుతున్నాయి. ఎస్.కోటలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామంటూ మంత్రి మండలిలో తీర్మానం చేసినప్పటికీ ఆచరణలో అటువంటి ప్రయత్నాలు కనిపించడం లేదు. ఇలా ఎన్నో సమస్యలు, మరెన్నో అభివృద్ధి ఆటంకాలతో ఒక్క అడుగు ముందుకు నాలుగు అడుగుల వెనక్కి అన్న చందంగా ముందుకు సాగుతోంది. ఈనేపథ్యంలో ప్రజారక్షణ భేరీ పేరిట సిపిఎం పేరిట చేపట్టిన బస్సు యాత్ర చర్చనీయాంశంగా మారింది.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం

హైరిస్క్ గర్భిణీలను గుర్తించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. ఆశా నోడల్ అధికారులతో జిల్లా ఆరోగ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆర్‌సిహెచ్‌లో మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాల నివేదికల నమోదు, గర్భిణులకు మొదటి త్రైమాసికలో త్వరితగతిన నమోదు (రిజిస్ట్రేషన్), హైరిస్క్ గర్భిణీలను గుర్తించి పర్యవేక్షణ, వారికి పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు జరగాలని, మొదటి కాన్పు, ఆడ శిశువు జన్మించిన రెండో కాన్పుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పిఎంఎంవివై) పథకం అర్హులందరికీ చేరేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు టిడి టీకా రెండు డోసులు, క్రమం తప్పకుండా నిర్దేశించిన మోతాదులో ఐరన్ ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు వేయాలని, అన్ని హెల్త్ చెకప్స్, ల్యాబ్ పరీక్షలు గర్భిణీలకు పక్కాగా నిర్వహించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. హైరిస్క్ గర్భిణీల ఆరోగ్య సేవలకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం వినియోగించాలన్నారు. నవజాతశిశువుల గృహ సందర్శనలు ఆశా కార్యకర్తలు విధిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, నోడల్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్, డిపిహెచ్‌ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, సిబ్బంది విజయలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌కు ప్రతిష్టాత్మక 'సరిలేరు నీకెవ్వరు' పురస్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



హైదరాబాదుకు చెందిన ప్రముఖ సాహితీ సంస్థ అజో విభో కందాళం ఫౌండేషన్ వివిధ రంగాల్లో యుద్ధ ప్రతిష్టులైన వారికి అందించే సరిలేరు నీకెవ్వరు పురస్కారానికి పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గిరిజన రచయిత మల్లిపురం జగదీష్ ఎంపికైనట్లు ఆ సంస్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 2024 జనవరి 5న విశాఖపట్టణం కళాభారతిలో నాలుగు రోజుల పాటు అజోవిబో-కందాళం ఫౌండేషన్ రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగే వార్షికోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాన్ని రూ.25 వేలు నగదు బహుమతితో పాటు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జగదీష్‌కు పురస్కారం లభించడం పట్ల పట్టణానికి చెందిన ప్రముఖ రచయితలు గంటేడ గౌరినాయుడు, చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు, పక్కి రవీంద్రనాథ్, పాలకొల్లు రామలింగస్వామి, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావుతో పాటు పలువురు సాహితీ అభిమానులు అభినందనలు వ్యక్తం చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో గల పలు గిరిజన గ్రామాలకు బిటి రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జుంబిరి బిటి రోడ్డు నుంచి నాయుడుగూడ వయా పెద్దగూడ వరకు 2.60 కిలోమీటర్లు రూ.కోటి 50 లక్షలు, పెద్దగూడ నుండి కొత్తపేట జంక్షన్ వరకు 40 మీటర్లు రూ.32 లక్షలు, పెద్దగూడ కొత్తపేట రోడ్డు నుంచి సిరిపురం వరకు 1.80 కిలోమీటర్లు రూ.కోటి 35 లక్షలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి జి.సుజాత, స్థానిక సర్పంచ్ ఎ.మన్మథరావు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిస్సార్, మండల కన్వీనర్ గౌరీశంకర్, వైసిపి వాణిజ్య విభాగాల అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, బిటిడిఎ డిఇ సింహాచలం, ఎఇ అప్పారావు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణీ, బాలింత, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తుల తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నడిమికెల్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

మండలంలోని నడిమికెల్లలో ఈనెల 3న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులతో పాటు వైద్య అధికారులు సమయపాలన పాటించి విధిగా హాజరు కావాలని ఆయన కోరారు

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

కష్టపడి చదవాలి : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగి బాగా చదివినప్పుడే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి నిమ్మక ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని కస్తూరిబా, జిల్లా పరిషత్, కొత్తగూడ, కేదారిపురం కాలనీ, టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలు, భద్రగిరి గురుకుల బాలుర, బాలికల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈనెల 3న నిర్వహించబోయే ఎస్ఇఎఎస్ పరీక్ష కోసం నిర్వహిస్తున్న మాల్ ప్రాక్టీస్ పరీక్షను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాల బోధన జరగాలని, విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఇఎంఆర్ఎస్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరంజని ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్ర భవనాల పనులు పెండింగ్ ఉన్నాయని, వీటన్నింటినీ పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి పనులు చేయడంతోనే అభివృద్ధి చెందుతాయని అధికారులు చేసిన పనులకు బిల్లులు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం బాబ్జీ, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, వివిధ శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు చీరలు, పసుపు, కుంకుమ అందజేస్తున్న సిఐ సత్యనారాయణ

సౌకర్యాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం గర్భిణీలకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక వైటిసి గర్భిణీల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న గర్భిణీలకు చీరలు, పసుపు కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కొండలపై దూరప్రాంతాల్లో ఉన్న గర్భిణీల సమస్యలను గుర్తించి ప్రభుత్వం గర్భిణీల వసతి గృహాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి గర్భిణి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అప్పుడే ప్రతి గర్భిణీ సుఖప్రసవం జరిగి తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. సోదరి భావంతో గర్భిణీలకు చీరలు సమకూర్చిన తోటపల్లి దేవస్థానం డైరెక్టర్ పాత్రోకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైటిసి మేనేజర్ రాము ఉన్నారు.

వైద్యులకు జమ్మాన సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పర్యటనలో భాగంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని విశేష సేవలందించి ఈ కార్యక్రమం విజయవంతం చేసిన పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను, వారి సహచర బృందాన్ని కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ జగన్నాధరావు, డిసిహెచ్ఎస్, డిస్ట్రిక్ట్ హెల్త్ సూపరింటెండెంట్ వాగ్దేవిని, ప్రాజెక్ట్ ఆర్గనైజర్ డాక్టర్ వినోద్ కుమార్ జగనన్న ఆరోగ్య సురక్ష జ్ఞాపికలతో వారిని ఘనంగా సత్కరిస్తూ పేదలకు విశేష వైద్య సేవలందించి సహకరించారన్నారు. అదే విధంగా పేదల ఆరోగ్యం పట్ల భవిష్యత్తులో కూడా స్వచ్ఛందంగా మరింకెన్నో సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌ను డాక్టర్లంతా కలిసి ప్రభుత్వం తరుపున చేస్తున్న కృషిని అభినందిస్తూ రాబోయే రోజుల్లో మంచి స్థానంలో మరెన్నో విశేష సేవలందించాలని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ జగన్నాధరావును సన్మానిస్తున్న ప్రసన్నకుమార్

సచివాలయ సిబ్బందే దిక్కు

అస్తవ్యస్తంగా నగర పంచాయతీ పనితీరు

ప్రజాశక్తి, పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పనితీరు రోజురోజుకు అధ్వానంగా మారుతుంది. 2013 మార్చిలో మేజర్ పంచాయితీని నగర పంచాయితీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అది నుంచి నగర పంచాయితీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏటా కోటి రూపాయలకు పైగా ఆదాయం వస్తున్న నేటికీ పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. దీంతో సరైన సేవలందక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

పర్యవేక్షించే అధికారులు కరువు

నగర పంచాయితీలో కొంత కాలంగా ప్రధాన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పరిపాలన గాడిలో పెట్టాల్సిన మేనేజర్ పోస్ట్ కొద్దిరోజులు నుంచి ఖాళీగానే ఉంది. ఇక్కడ పని చేసిన మేనేజర్ జయరామ్ డిప్యూటేషన్‌పై సాలూరు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వెళ్లిపోవడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడింది. సుమారు ఆరు నెలల నుంచి టిపిఎస్ పోస్ట్ ఖాళీగా ఉంది. టిపిఎస్‌గా పని చేసిన సత్యనారాయణ ఆముదాలవలస బదిలీపై వెళ్లిపోవడంతో సచివాలయ

సిబ్బంది హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

కార్యదర్శులతో టౌన్ ప్లానింగ్ విభాగం నడుస్తుంది. కొంత కాలం క్రితమే ఎఇగా ఉన్న కిరణ్ నెల్లిమర్లకు బదిలీ అయిపోవడంతో సచివాలయం ఇంజనీరింగ్ కార్యదర్శులు ఈ బాధ్యతలు చూస్తున్నారు. ప్రధానంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ దృష్టిపెట్టిన నాథుడే కరువయ్యారు.

సమయానికి రారు

అసలే సిబ్బంది కొరత. కీలక పోస్టులతో పాటు కింది స్థాయిలో సిబ్బంది పూర్తి స్థాయిలో లేరు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు కూడా పూర్తిస్థాయిలో విధులపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం కమిషనర్ తో పాటు మిగిలిన సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాలేదు. మధ్యాహ్నం 12గంటల సమయంలో కూడా రెగ్యులర్ ఉద్యోగులెవరూ కార్యాలయంలో లేని పరిస్థితి. అకౌంటెంట్ సీతంపేట ఐటిడిఎకు వెళ్లగా, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ ఎక్కడ ఉన్నారో కూడా తెలియదని పరిస్థితి. కమిషనర్ తన కార్యాలయనికి వస్తారో, రారో కూడా ఎవ్వరూ చెప్పలేని పరిస్థితి. దీనితో వివిధ పనుల మీద వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగారు.

'మద్యంతో జగన్ దోపిడీ'

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో మద్యం వ్యాపారం ద్వారా సిఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష కోట్ల రూపాయలు దోపిడీ చేశారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి విమర్శించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కల్తీ మద్యం వ్యాపారానికి తెరలేపిందన్నారు. నాలుగున్నరేళ్లలో కల్తీ మద్యం విక్రయాలు చేయించి లక్ష కోట్ల రూపాయలు దోపిడీ చేశారని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై మద్యం కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం హయాంలో కల్తీ మద్యం విక్రయాలపై ఉక్కు పాదం మోపారని చెప్పారు. ప్రజలు వాస్తవాలు గమనించాలని, రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెబుతారని సంధ్యారాణి చెప్పారు. విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్ పప్పల మోహన్ రావు, డబ్బి కృష్ణ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని కేసు పెట్టడం దుర్మార్గమైన చర్య అని మండల టిడిపి అధ్యక్షులు ఆక్కేన మధుసూదనరావు అన్నారు. గత నాలుగున్నరేళ్లుగా కల్తీ, నాసిరకమైన మద్యం అమ్మి లక్షల కోట్లు దోచుకున్న జగన్ రెడ్డి, అతని అనుచరులు, చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందంటూ కేసు పెట్టడం దెయ్యాలు వేదాలు చెప్పినట్టు ఉందని అన్నారు. గురువారం ఖడ్గవలస జంక్షన్లో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అరకు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అంబటి రాంబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో దాచుకో, దోచుకో అన్న చందంగా పాలన పక్షం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. గత నాలుగున్నరేళ్లలో మద్యం అమ్మకాలపై సిబిఐ విచారణ చేయించి జరిగిన అవకతలపై బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సంతోషపురం ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రయోగాత్మక పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ పంచాయతీ దిగువమండలో బడి నుంచి పొలంబడికి కార్యక్రమంలో భాగంగా పాఠశాల పాఠ్యాంశాలలో ప్రకృతి వ్యవసాయ అంశాలను జోడించేందుకు గానూ తయారు చేసిన గేయాలు, పాటలు, పాఠాలు పిల్లలకు ఎంతవరకు చేరువకాగలవో ప్రయోగాత్మక పరిశీలనను ఆర్‌వైఎస్ఎస్ సిలబస్ డెవలప్మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు , కన్సల్టెంట్ టి. శివాజీ నిర్వహించారు. ముందుగా మండ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలను కలిసి ఆటపాటలతో బాలబాలికల అవగాహన కల్పించారు. సర్పంచ్ హైమావతి, అంగన్వాడీ కార్యకర్త, హెల్త్ అండ్ న్యూట్రీషన్ విభాగానికి చెందిన జి.సత్యవతి, సిహెచ్.గౌరీ, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ వి.సన్యాసిరావు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం దిగువమండలో గల ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పిల్లల్లో వ్యవసాయం, ప్రకృతి పట్ల గల అవగాహనను తెలుసుకుని పిల్లలు పాఠ్యపుస్తకాల్లో గల అంశాలపై ప్రశ్నలు వేసి వారికి ఏం కావాలో అభిరుచు లను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలకు ఏ తరహా బోధన అందిస్తున్నా రో తెలుసుకుని ఆటపాటల ద్వారా వ్యవసాయ విషయాలు ఎలా అందించాలో చర్చించారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను సందర్శించి వ్యవసాయ విధానాలను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాలక దేవానంద్, రైతులు ఉన్నారు.

నిబంధనలు తప్పనిసరి : డిఐఒ

ప్రజాశక్తి - బెలగాం

వైద్యారోగ్యశాఖ సూచించిన నిబంధనలను ప్రైవేట్ ఆసుపత్రుల్లో కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన తన వైద్య బృందంతో పట్టణంలో గల శ్రీ సాయిగంగ, సాయిసంధ్య ఫిజియథెరపీ, శ్రీ కృష్ణా నర్సింగ్ హెూమ్ ఆసుపత్రులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు ఏ మేరకు ఆసుపత్రిలో అమలు జరుగుతున్నవో పరిశీలించారు. ఆసుపత్రిలో నమోదవుతున్న ఔట్ పేషెంట్, ఇన్ పేషంట్ రోగుల రికార్డులు, వారికి అందజేస్తున్న చికిత్స పరిశీలించారు. ల్యాబ్, పరికరాలు నిర్వహిస్తున్న పరీక్షలు, రుసుం(ఫీజు) వివరాలు రికార్డులో తనిఖీ చేసి వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. రోగులు వేచి ఉండే ప్రదేశం, వాటి నిర్వహణ పరిశీలించారు. ఆసుపత్రి రెన్యువల్ గడువు తేదీలను పరిశీలించారు. ఆసుపత్రిలో వ్యర్థాలను బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పక్కాగా నిర్వహించి తొలగించాలన్నారు. ఆరోగ్య సూచనలు తెలియజేసే పోస్టర్లు ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు సరైన స్థలంలో అందుబాటులో ఉంచాలన్నారు. టాయిలెట్ల నిర్వహణ పరిశీలించారు. రిజిస్ట్రేషన్ పేరును ఆసుపత్రి పేరుతో సరిచూశారు. మలేరియా, డెంగీ మొదలగు నోటిఫైడ్ వ్యాధులను గుర్తిస్తే నిర్దేశించిన పోర్టల్‌లో ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డెమో వై.యోగీశ్వరరెడ్డి, సూపర్వైజర్ జయగౌడ్ తదితరులు ఉన్నారు.

నాణ్యతా లోపంపై టిడిపి ఆగ్రహం

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

చెరువుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత సరోవర్ పథకంలో భాగంగా పట్టణంని కొత్తవలన దుర్గమ్మ కోనేరు అభివృద్ధి పనులు చేపడుతున్నారని, ఈ పనుల్లో నాణ్యతలోపం కన్పిస్తుందని టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఆరోపించారు. గురువారం కొత్తవలన దుర్గమ్మ కోనేరు అభివృద్ధి పనులను ఆయనతో పాటు టిడిపి నాయకులు, కౌన్సిల్ సభ్యులు, కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ కోనేరు గట్టుపై నిర్మాణం చేపడుతున్న రోడ్డు కేవలం బూడిదతో కూడిన నాసిరకమైన గ్రావెల్ మాత్రమేనని, సైడు వేసిన సిమెంట్ దిమ్మలు కూడా నాణ్యతలోపమేనని, నాణ్యమైన మెటీరియల్ కాదని అన్నారు. ఈ కోనేరు అభివృద్ధికి రూ.94లక్షల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులను దుర్వినియోగం చేయడానికి మాత్రం తూతూ మంత్రంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై తక్షణమే విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను కోరుతామన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్‌ను కూడా సంప్రదిస్తామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఎటువంటి నాణ్యతాలోపం జరగలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎక్కడా నాణ్యతతో కూడిన పనులు

కాలువ పనులను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయచంద్ర

జరగడంలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం కేవలం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికే చూస్తుంది తప్ప అభివృద్ధి చేయడానికి కాదన్నారు. ఈ అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ విషయంపై తాము ఎంతవరకైనా వెళ్తామన్నారు. ఆయనతో పాటు ఐటిడిపి కో ఆర్డినేటర్ బార్నాల సీతారాం, ఐటిడిపి అరకు పార్లమెంటు అధ్యక్షులు కోరాడ నారాయణరావు, టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పోలా నత్యనారాయణ (పిఎన్ఎన్), జి.భానుప్రసాద్, కోలా మధునూదనరావు, బలగ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమే గెలుస్తుంది : శత్రుచర్ల

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భవిష్యత్తులో ఎప్పుడైనా, ఎక్కడైనా న్యాయమే గెలుస్తుందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. గురువారం స్థానిక ఎస్ఎన్ఎం నగర్‌లో గల బంగ్లాలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయమైన పాలనకు చమరగీతం పాడేందుకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బెయిల్‌పై విడుదలైనట్టు తెలిపారు. ఇక అధికార పార్టీకి కౌంట్ డౌన్ మొదలైందని, కురుపాము నియోజకవర్గంలో పూర్ణపాడు-లాబేసు వంతెన టిడిపి హయాంలో 90 శాతం పూర్తి చేస్తే మిగిలిన 10శాతం ఇప్పటి వరకు పూర్తి చేయకుండా ఈ ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. తాను పార్వతీపురం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చేసేందుకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి రూ.25 లక్షలు విలువచేసే తాగునీటి ట్యాంకను మున్సిపాల్టీకి అందజేశానని, ఆ ట్యాంక్ నిర్వహణను చేయకుండా మూలకు చేర్చారని విమర్శించారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు, వేధింపులకు, దాడులకు గురవుతున్నారని, త్వరలో టిడిపి హయాంలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని అన్నారు. విలేకరుల సమావేశంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు మజ్జి కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి శత్రుచర్ల విజయమరాజు

సూపరింటెండెంట్‌కు సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయంలో సి.సెక్షను సూపరింటెండెంటుగా పనిచేస్తున్న డి.శేఖర్ విశాఖపట్నం, జిసిసి జిల్లా మేనేజరు కార్యాలయంలో సీనియర్ మేనేజరుగా డిప్యుటేషనుపై వెడుతున్న సందర్భంగా కలెక్టరేట్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంటు, జిల్లారెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనా పోస్టర్‌ను అతికిస్తున్న ఎంపిడిఒ, సిఎస్‌డిటి

వినియోగదారుల కోర్టులో ఫిర్యాదుపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేయడం ఎలా అనే వాల్‌పోస్టును సివిల్ సప్లై డిటి మధుసూదన్‌రావు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద పోస్టరును అతికించారు. దీన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు కోర్టులో ఫిర్యాదు చేయడం ఎలా?, కొన్న వస్తువులకు, సేవలకు బిల్లు ఎంత అవసరమో తెలుసా అనే పోస్టరును సచివాలయాల్లోనూ, పంచాయతీ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద అతికించి దానిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఎక్కువగా జనసమర్థమున్న ప్రదేశాల్లో ఈ పోస్టర్లను అంటించామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పోస్టర్లను పంపిణీ చేసిందని తెలిపారు.

పరజపాడులో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పరజపాడు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 487 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి శశికళ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.గౌరీశంకరరావు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

సోమ గండిలో...

సీతంపేట : మండలంలోని సోమగండిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 515 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్ కె.విజయ పార్వతి వైద్యశిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాయిచరణ్ తహశీల్దార్ నరసింహమూర్తి, ఇఓపిఆర్‌డి కొండపల్లి సత్యం, సర్పంచ్ రుతోనీ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

శ్రీకాకుళం మాజీ పార్లమెంటు సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు కింజరాపు యర్రన్నాయుడు సేవలు మరువలేనివని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు గురువారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో జరిగిన యర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి బోనెల విజయ్ చంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, కొల్లి తిరుపతిరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, నాయకులు కోల బాబు, జాగాన రవికుమార్, అక్కేన శ్రీనివాసరావు, జి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జామివారి కాంప్లెక్స్ ఆవరణలో గురువారం కీర్తిశేషులు మాజీ కేంద్ర మంత్రి కింజరాపు యర్రన్నాయుడు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల యువత అధ్యక్షులు మాచర్ల అనిల్, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, బల్ల హరిబాబు, ఎ.కుమారస్వామి, బి.నీలకంఠంనాయుడు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

సీతంపేట : యర్రన్నాయుడు వర్ధంతి పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన మండలంలోని ధారపాడులో నిర్వహించారు. యర్రన్నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, బిడ్డిక సుబ్బారావు, బిడ్డిక స్వామినాయుడు, మండంగి ప్రకాశం, ప్రచార కర్త తోయిక సంధ్య రాణి, మాజీ ఎంపిటిసి ఆరిక సువర్ణ, ఆరిక వరలక్ష్మి, సుందరరావు, ఆనందరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం : యర్రన్నాయుడుకు నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

సర్వే టెస్టుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే టెస్ట్ విద్యార్థులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని గుమ్మలక్ష్మీపురం నోడల్ టీం సభ్యులు బిడ్డిక బీముడు, బంటు సింహాచలం తెలిపారు. గురువారం వీరికి నిర్దేశించిన పాఠశాలలకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ టెస్ట్ పరీక్ష పత్రాలను, ఒఎంఆర్ షీట్లను అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక చింతలగూడ ఎలిమెంటరీ పాఠశాలలో పరీక్ష పత్రాలను, ఒఎంఆర్ షీట్లను అందించి విద్యార్థులకు సర్వే టెస్ట్‌పై ముందస్తుగానే అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అచీవ్మెంట్ సర్వే టెస్ట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ నోడల్ బృందంలో సిఆర్‌పి సింహాచలం, పాఠశాల మేనేజర్ బి.కృష్ణమూర్తి నాయుడు, హెచ్ఎం కుమారస్వామి, ఉపాధ్యాయులు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

కురుపాం : నిర్ణీత కాలంలో నిర్దేశించిన పనులను సిబ్బంది పూర్తి చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల సమైక్య కార్యాల యం వద్ద ఎపిఎం ఇవి కిషోర్ ఆధ్వర్యంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకెపి ద్వారా మహిళలకు అందిస్తున్న పథకాలైన మహిళా సంఘాల పొదుపులు, లోకోస్ యాప్ ప్రొఫైల్ మానిటర్ ఆప్డేషన్, జగనన్న తోడు, స్త్రీ నిధి న్యూ లోన్స్ రిక్వెస్ట్లు, నిధి డిసిబి ఉన్నతి డిసిబి, మహిళా మార్ట్ వాటా ధనం, హౌసింగ్ ఋణాల మంజూరు, వైఎస్ఆర్ చేయూత గ్రౌండింగ్ తదితర అంశాలపై సమీక్షించి సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్, సిసిలు, విఓఎలు పాల్గొన్నారు.

ధారపాడులో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధారపాడులో పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు షురిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మండలంలోని ధారపాడులో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ రాబోయేది టిడిపి ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమని పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, బిడ్డిక సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరిక పవన్, ప్రచార కర్త తోయిక సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మంటలపై చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్‌లో పొడి చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో సమీపంలో ఉన్న కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీనివాసా కాలనీ, కామాక్షి అమ్మవారి ఆలయం పరిసరాల్లోకి పొగలు వ్యాపించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజు స్పందించారు. గురువారం మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో మంటలను ఆర్పించారు. డంపింగ్ యార్డ్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, తడి చెత్తను వేరు చేయించారు.

నేడు జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - సీతంపేట

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం సీతంపేట మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఐటిడిఎ కార్యాలయంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు.